


పీఆర్వో కార్యాలయం వద్ద కార్లతో నిండిన పార్కింగ్ స్థలం





ద్విచక్రవాహనాలతో కిక్కిరిసిన లోవతోట పార్కింగ్ స్థలం

అప్పన్న చెంత.. పార్కింగ్ చింత



- నరిపడా పార్కింగ్ స్థలాల్లేక వాహనదారుల ఇక్కట్లు
- బస్టాండ్, ఘాట్‌రోడ్డు, హిల్‌టాప్‌పైనే వాహనాల పార్కింగ్
- శని, ఆదివారాలు, పర్వదినాల్లో మరిన్ని కష్టాలు
- ట్రాఫిక్ సమస్యను పట్టించుకోని దేవస్థానం అధికారులు

సింహాచలం: రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో ఒకటైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని రోజూ వేల సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారు. వీరు ఎక్కువగా ద్విచక్రవాహనాలు, కార్లు, టూరిస్టు వైహికల్స్‌పై వస్తుంటారు. శని, ఆదివారాలు, ప్రముఖ పర్వదినాల్లోనైతే సింహగిరికి వచ్చే వాహనాల సంఖ్య మరింత భారీగా ఉంటుంది. అంతేకాకుండా దేవస్థానానికి చెందిన నాలుగు బస్సులు, విశాఖ నగరం నలుమూలల నుంచి భక్తులతో వచ్చే సింహాచలం ఆర్టీసీ డిపో బస్సులు 30, విజయనగరం నుంచి పలు సర్వీసులు నేరుగా సింహగిరికి రాకపోకలు సాగిస్తుంటాయి. వీటికి పార్కింగ్ వసతి కల్పించడంలో దేవస్థానం అధికారులు కనీస ధ్యాస చూపట్లేదన్న ఆక్షేపణలున్నాయి.

లోవతోట నుంచి మొదలు..

కొండ దిగువ టోల్‌గేట్లు దాటి ఘాట్‌రోడ్డుల్లో ప్రయాణించి సింహగిరికి చేరుకున్న వాహనదారులకు లోవతోట నుంచి ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతాయి. లోవతోటలో ద్విచక్రవాహనాల పార్కింగ్ సదుపాయం ఉంది. అయితే ఆ ప్రాంగణం ఎప్పుడూ వాహనాలతో తీవ్ర రద్దీగా ఉంటుంది. దీంతో ఆ ప్రాంతంలో వాహనాలను పార్కింగ్ చేద్దామని తొలుత అక్కడికి వెళ్లే ద్విచక్రవాహనదారులు ఖాళీ లేక మళ్లీ వెనక్కి రావాల్సిన దుస్థితి. దీంతో కొంతమంది తమ ద్విచక్ర వాహనాలను ఘాట్ రోడ్డులోనే పార్కింగ్ చేస్తున్నారు. ఉచిత దర్శనానికి వెళ్లే మార్గం కూడా లోవతోట వైపు నుంచే ఉండటంతో ఇక్కడ ద్విచక్ర వాహనదారులు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు.

కార్లు, టూరిస్ట్ బస్సుకు ఇక్కట్లు

ఇక కార్లు, టూరిస్టు వెహికల్స్‌పై వచ్చే భక్తుల బాధలు వర్ణనాతీతం. కార్ల పార్కింగ్ కోసం సింహగిరిపై ఉన్న జోడు భద్రాల ప్రాంగణం, పీఆర్వో కార్యాలయం ఎదుటనున్న స్థలం, గజపతిసత్రానికి వెళ్లే మార్గం నిత్యం కిక్కిరిసి ఉంటాయి. మరోదారి లేక సింహగిరి బస్టాండ్ వద్ద ఉన్న ప్రధాన రోడ్డుకు ఇరువైపులా కార్లు పార్క్ చేస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్డుకు ఇరువైపుల పార్క్ చేసి ఉంటున్న కార్లతో బస్సులు వెళ్లలేని దుస్థితి. ఒక్కోసారి హిల్‌టాప్ రోడ్డులో సైతం వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఏ వాహనం ఎటు వెళ్తుందో తెలియని అయోమయం. ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకుని ముందుకు వెళ్లలేని దుస్థితి. సరైన పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు కూడా ట్రాఫిక్‌ని కంట్రోల్ చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. దర్శనానికి వచ్చే భక్తులు, తమ వాహనాలు పార్కింగ్ చేయడానికే సమయం ఎక్కువగా వెచ్చించాల్సి వస్తోందని వాపోతున్నారు.

వాహనాల టోల్ రుసుం ఏటా రూ.కోటి!

దేవస్థానానికి ఏటా రూ.కోటికి పైగా ఆదాయం వాహనదారుల ద్వారా వస్తున్నదేనంటే అతిశయోక్తి కాదు. సింహగిరికి వెళ్లేందుకు దేవస్థానం టోల్ రుసుం వసూలు చేస్తుంది. ఆ బాధ్యతను వేలం పాట ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగిస్తుంది. ఈ ఏడాది రూ.1.20 కోట్ల ఆదాయం టోల్‌గేట్ వేలం ద్వారా దేవస్థానానికి లభించింది. సింహగిరికి వెళ్లే ద్విచక్రవాహనానికి రూ.10, కారుకు రూ.30, టాటా మ్యాజిక్‌కు రూ.40, 12 సీటర్ మినీ బస్సుకు రూ.100, 24 సీటర్ మినీ బస్సుకు రూ.200 వసూలు చేస్తారు. వీరి ద్వారా ఇంత ఆదాయం వస్తున్నా.. వీరి వాహనాలకు సరైన పార్కింగ్ సౌకర్యం లేక, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా దేవస్థానం అధికారులు పార్కింగ్ వసతులపై దృష్టిసారించాలని భక్తులు, వాహనదారులు కోరుతున్నారు.



హిల్‌టాప్ రోడ్డులో సైతం పార్కింగ్

హిల్‌టాప్ రోడ్డులో ఇబ్బందులు



నేను ఫ్యామిలీతో **స్వామివారి** దర్శనానికి వచ్చాను. సింహగిరిపై కారు పార్కింగ్ చేయడానికి ఎక్కడా ప్లేసు లేకపోవడంతో హిల్‌టాప్ రోడ్డులో పార్కింగ్ చేయాల్సి వచ్చింది. హిల్‌టాప్‌రోడ్డుకి వెళ్లేటప్పుడు అస్తవ్యస్తంగా పార్కింగ్ చేసిన వాహనాలను తప్పించలేక నానా ఇబ్బందులు పడ్డాను. ఏ వాహనం ఎటు నుంచి వస్తుందో తెలియని పరిస్థితి. పద్మవ్యూహాన్ని తలపించే విధంగా ఉంది.

– మధు, నరసన్నపేట

కారు బయటకి తీయలేని పరిస్థితి



నేను నా బంధువులతో కలిసి స్వామివారి దర్శనానికి వచ్చాను. గజపతి సత్రం వద్ద కారు పార్క్ చేశాను. నా దర్శనం అవ్వగానే తిరిగి వచ్చి కారు తీద్దామంటే నా కారు వెనుక మరొక కారు పార్క్ చేసి ఉంది. ఆ కారుకి సంబంధించిన వారు దర్శనం చేసుకుని వచ్చేవరకు నా కారు తీయడానికి వీల్లేని పరిస్థితి నెలకొంది. సరైన పార్కింగ్ వ్యవస్థ, సూచనలు ఇచ్చే వారు లేకే ఈ దుస్థితి.

– గణేష్, పెందుర్తి

మేలుకొలుపుతో ఆధ్యాత్మిక చింతన



నాయుడుపాలెం పురవీధుల్లో సీతారాముల పల్లకీ ఊరేగింపులో ధార్మిక జట్టు సభ్యులు

పరవాడ: ధనుర్మాసంలో భాగంగా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాయుడుపాలెం గ్రామంలో తొలిరోజు మేలుకొలుపు కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మేలుకొలుపులో భాగంగా నాయుడుపాలెం సిద్ధివినాయక ఆలయం నుంచి సీతారాముల విగ్రహాలను పల్లకిలో అధిష్ఠింపజేసి నాయుడుపాలెం, వాడచీపురుపల్లి పురవీధుల్లో ధార్మిక జట్టు సభ్యులు ఊరేగించారు. ఇంటి ముంగిటకు పల్లకిపై వచ్చిన స్వామివార్లను ఆరాధించి ధన, వస్తు, సేవ రూపంలో సహాయం చేయడం ద్వారా మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని భక్తులకు సూచించారు. ధనుర్మాసంలో భగవంతుని చింతనతో మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలోని గన్నవరం విమానాశ్రయం వద్ద తలపెట్టిన హైందవ శంఖారావం సభకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై, విజయవంతం చేయాలని పరవాడ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు కూండ్రపు అప్పలనాయుడు, కూండ్రపు శ్రీరామ్మూర్తి, డి.లక్ష్మి, డి.అచ్చిత, అమ్మాజి, ప్రసన్న, లక్ష్మి, సత్యవతి, కె.శ్రీనివాసరావు, సన్యాసినాయుడు, నరేష్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు



లక్ష్మీప్రసన్న

పెందుర్తి: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పెందుర్తి పోలీసులు తెలిపారు. వివరాలు. పెదనరవ ప్రాంతానికి చెందిన వాండ్రాసి లక్ష్మీప్రసన్న(21) ఈ నెల 13న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా జాడ తెలియలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసినవాళ్లు 0891-2764233, 9440796039 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

క్లుప్తంగా

వెంకన్న ఆలయంలో ధనుర్మాస పూజలు



విశేష అలంకారంలో గోదాదేవి అమ్మవారు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి ధనుర్మాసం పూజలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున 4 గంటలకు సుప్రభాతసేవ, ఆరాధన నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తికి విశేష అలంకరణ చేసి ఆలయ ప్రాంగణంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. తొలి పాశుర విన్నప పఠనం చేశారు. విశేష హారతి అందించారు. అడవివరం గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు భార్గవ్ తదితరులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

అక్రమ నిర్మాణం తొలగింపు



తొలగించిన అక్రమ నిర్మాణం

పెందుర్తి: ప్రకాష్‌నగర్‌లో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని జీవీఎంసీ జోన్–8 టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమవారం తొలగించారు. నిబంధనలు పాటించకుండా జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణంపై ఇటీవల కలెక్టర్‌కి ప్రకాష్‌నగర్ కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ జోన్–8 జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జోన్–8 జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు భవన నిర్మాణాన్ని పరిశీలించారు. అక్రమ నిర్మాణమని తేలడంతో, దాన్ని యంత్రాల సాయంతో వెంటనే తొలగించారు. ప్రభుత్వ స్థలాలు, గెడ్డలు, చెరువులు ఆక్రమించి చేపట్టే నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించనున్నట్లు ఈ మేరకు అధికారులు హెచ్చరించారు.

మరమ్మతులకు గురైన సామాజిక భవనం



మరమ్మతులతో మూలకు చేరిన జాలరిపేట సామాజిక భవనం

పరవాడ: ముత్యాలమ్మపాలెం శివారు జాలరిపేట కాలనీలో ఏర్పాటు చేసిన సామాజిక భవనం మరమ్మతులకు గురైంది. 15 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం గచ్చులు పూర్తిగా పాడైపోయాయి. శ్లాబ్ పెచ్చులూడి చిన్నపాటి వర్షం కురిసినా భవనం కారిపోతోందని కాలనీవాసులు వాపోతున్నారు. దీంతో భవనం ఉపయోగంలో లేకుండా పోయింది. కాలనీలో సభలు, సమావేశాలు, శుభకార్యాలు నిర్వహించుకోవాలంటే ఇబ్బందిగా ఉందని స్థానికులు చెప్తున్నారు. సామాజిక భవనానికి మరమ్మతులు చేపట్టి, స్థానిక అవసరాలకు వినియోగించుకునేలా పునరుద్ధరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పీజీఆర్ఎస్ అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ

పెందుర్తి: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చే అర్జీలపై సత్వర పరిష్కార చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ హైమావతి సంబంధిత అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం స్థానిక ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. ఎక్కువగా గెడ్డ ఆక్రమణలు, పందులు, కుక్కల బెడద, రోడ్లు, కాల్వల మరమ్మతులపైనే ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను సూచించారు. జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేపగుంట-పినగాడి రోడ్డు విస్తరణ కుదించాలి



వీఎంఆర్‌డీఏ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న పినగాడి సర్పంచ్ వెంకటలక్ష్మి

పెందుర్తి: వేపగుంట నుంచి పినగాడి వెళ్లే మార్గం 150 అడుగులకు విస్తరిస్తే స్థానిక నివాసితులు, చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడతారని, వారంతా నిలువ నీడ కూడా కోల్పోయే పరిస్థితి ఉంటుందని వీఎంఆర్‌డీఏ చైర్మన్‌కు పినగాడి గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. పినగాడి సర్పంచ్ బయిలపూడి వెంకటలక్ష్మి , వైఎస్సార్‌సీపీ నాయకుడు భగవాన్ జయరామ్ ఆధ్వర్యంలో పలువురు స్థానికులు వీఎంఆర్‌డీఏ చైర్మన్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. వేపగుంట నుంచి పినగాడి రోడ్డును 150 అడుగులకు విస్తరిస్తే జరిగే పరిణామాలను, నివాసితుల కష్టాలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సాక్షిలో 'విస్తరణ కాదు.. వినాశనం'శీర్షికన శుక్రవారం(13న) ప్రచురితమైన కథనం క్లిప్పింగ్‌ను ఆయనకు అందించారు. నివాసితుల బాధలను దృష్టిలో ఉంచుకుని విస్తరణ వెడల్పును తగ్గించాలని కోరారు.

మొరాయించిన లారీ.. నిలిచిన ట్రాఫిక్



దేశపాత్రునిపాలెం కూడలిలో రోడ్డు మధ్యన మొరాయించిన ఇసుక లారీ

పరవాడ: దేశపాత్రునిపాలెం నాలుగు రోడ్ల కూడలిలో ఇసుక లారీ మొరాయించడంతో సోమవారం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 9 గంటల సమయంలో ఎన్టీపీసీ నుంచి కారిడార్ రహదారిలో వచ్చిన ఓ ఇసుక లారీ దేశపాత్రునిపాలెం నాలుగు రోడ్ల జంక్షన్ మధ్యకు వచ్చేసరికి మరమ్మతులకు గురై, ఆగిపోయింది. అదే సమయంలో అచ్యుతాపురం ఎస్ఈజెడ్, సింహాద్రి ఎన్టీపీసీ, హిందూజా, ఫార్మాసిటీ పరిశ్రమల్లో విధులకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థు ట్రాఫిక్ జామ్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను గుర్తించిన పరవాడ పోలీసులు రంగంలోకి దిగారు. సాయంత్రం ఇసుక లారీని పొక్లెయిన్ సాయంతో పక్కకు తొలగించడంతో ట్రాఫిక్ ఇక్కట్లకు చెక్ పడింది.

నంగినారపాడు రెవెన్యూ సదస్సుకు 23 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం: రైతుల భూ సమస్యల పరిష్కారానికి ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ అన్నారు. మండలంలోని జీవీఎంసీ పరిధి నంగినారపాడులో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై, రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రెవెన్యూ సదస్సుల ద్వారా తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను సమగ్రంగా విచారించి, సకాలంలో పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామంలో 102 సర్వే నెంబర్లలో మొత్తం భూమి 682.17 ఎకరాలు ఉందన్నారు. ఇందులో 382.79 ఎకరాలు ప్రభుత్వ భూమి, 299.27 ఎకరాలు జిరాయితీ భూమిగా పేర్కొన్నారు. నంగినారపాడు రెవెన్యూ పరిధిలో 356 మంది ఖాతాదారులు ఉండగా, గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి పలు సమస్యలపై 23 అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాల నాయుడు, గ్రామ పెద్దలు ఇందల రమణతో పాటు రెవెన్యూ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేసి, ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందించారు.

అంగన్‌వాడీ చిన్నారులకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

సబ్బవరం: మండలంలోని అంగన్‌వాడీ చిన్నారుల ఆధార్ నమోదు , అప్‌డేట్ కోసం ప్రత్యేక ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో పద్మజ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని పలు సచివాలయాలలో ఏర్పాటు చేసే ఈ క్యాంపులను ఆయా సచివాలయాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ నెల 17న సబ్బవరం-1, సబ్బవరం-3 సచివాలయాల్లో, 18న సబ్బవరం -4, సబ్బవరం-2, 19న వంగలి, గుల్లేపల్లి, 20న ఆరిపాక, మల్లునాయుడుపాలెం, 26న బంగారమ్మపాలెం, నారపాడు-1, 27న అసకపల్లి, నారపాడు-2, 28న గొటివాడ, గొల్లలపాలెం గ్రామ సచివాలయాల్లో ఈ ఆధార్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



మొగలిపురంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సబ్బవరం: మండలంలోని మొగలిపురంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జ్ గండి బాబ్జీ తనయుడు గండి వంశీదీప్ ఆధ్వర్యంలో గీతం ఆస్పత్రి సౌజన్యంతో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 276 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. 96 మందికి కంటి, ఇతర సమస్యలపై వైద్య పరీక్షలు జరిపి, శస్త్ర చికిత్సల నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్య శిబిరంలో డాక్టర్లు ఉదయ్ కుమార్(జనరల్ సర్జన్), అజ్మల్(ఆర్థోపెడిక్), కనిఫా(న్యూరో సర్జన్), భవ్య(ఈఎన్‌టీ), అమూల్య(గైనకాలిజిస్ట్), గీతిక(పీడియాట్రిక్), శ్రీనివాస్(జనరల్), గండి వంశీదీప్, తమరాణ బంగారినాయుడు, అంగటి నానాజీ, బయలపూడి రాంబాబు, రమేష్, మహేష్, గండి సత్యం, నరేష్, తమరాణ సత్యనారాయణ, మేడపాటి రాము తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. వేంకటాద్రిపై ధనుర్మాసోత్సవం



వెంకన్నకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



గోపూజలో ప్రధానార్చకుడు రామానుజాచార్యులు



భక్తులకు ఆశీస్సులు అందిస్తున్న రామానుజాచార్యులు

పెందుర్తి: వేంకటాద్రిపై ధనుర్మాసం ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున స్వామికి సుప్రభాతసేవ నిర్వహించారు. అనంతరం ఉదయం విష్వక్సేనపూజ ఆరాధన, గోపూజ, పుణ్యాహవచనం, హారతి, సేవాకాలం, శాత్తుమురై, తిరుప్పావైలోని తొలి పాశుర విన్నపంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. భక్తులు అశేషంగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం కొండ దిగువ నుంచి వేంకటాద్రికి ఉచిత వాహన సదుపాయం కల్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రధానార్చకుడు మహర్షి రామానుజాచార్యులు తెలిపారు.

మర్లమాంబ ఆలయ ప్రహరీ నిర్మాణానికి శ్రీకారం



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి తదితరులు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం శివారు పెదనాయుడుపాలెంలో కొలువైన మర్లమాంబ ఆలయ ప్రహరీ గోడ నిర్మాణానికి ఎంపీపీ బోకం సూర్యకుమారి సోమవారం కొబ్బరికాయ కొట్టి, పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు సుమారు రూ.5 లక్షలు వెచ్చించి అమ్మవారి ఆలయానికి ప్రహరీ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. త్వరితగతిన ప్రహరీ పనులు పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బోకం రామునాయుడు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, ఎంపీటీసీలు వీరప్ప శ్రీను, బైలపూడి దేముడుబాబు, వార్డు మెంబర్లు పోతల కనకరాజు, గొర్లి శ్రీనివాస్, బోకం రామకృష్ణ, ఎస్.శివ, పాల సొసైటీ అధ్యక్షులు సబ్బవరపు సత్యనారాయణ, కిల్లి వెంకట సత్యనారాయణ, రెడ్డి దేవుడుబాబు, ఎస్.నాగభూషణం, పోతల అప్పలనాయుడు, ఎస్.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఖరీఫ్ వరి కోతలు



వంగలిలో వరి కోత కోస్తున్న మహిళలు

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఖరీఫ్ వరి కోతలు చురుగ్గా సాగుతున్నాయి. ఇటీవల తుపాను, అల్పపీడనం హెచ్చరికల నేపథ్యంలో వరి పంట కోత దశకు వచ్చినా రైతులు వాయిదా వేసుకున్నారు. తుపాను ప్రభావం తగ్గడంతో ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ ఆరంభంలో వర్షాభావ పరిస్థితులతో నాట్లు ఆలస్యమయ్యాయి. ఆ తర్వాత వాతావరణం అనుకూలించి, వర్షాలు ఆశించినంతగా కురవడంతో పంట దిగుబడిపై రైతులు ఆశాజనకంగా ఉన్నారు. ప్రస్తుతం రైతులంతా వరి కోతలు, కుప్పలు వేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.